ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు


యారాడ ఉన్నత పాఠశాలలో సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న పాఠశాల సిబ్బంది


నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ కమిటీతో హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు


ఇస్లాంపేట ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల

పెదగంట్యాడ: పాఠశాల కమిటీ ఎన్నికలు మండలంలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 35 పాఠశాలలుండగా 18 ప్రాథమిక, 1 ప్రాథమికోన్నత పాఠశాలలో కమిటీల ఎన్నిక ఏకగ్రీవమైంది. మిగిలిన 16 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించడంతో కమిటీలను తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి తరగతి నుంచి ముగ్గురి సభ్యులను ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కె.పుష్పాంజలి, వైస్ చైర్మన్‌గా వై.శివప్రసాద్ ఎన్నికయ్యారు. ఎన్నికైన వారితో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు.

- జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్ కమిటీ ఎన్నికలో చైర్మన్‌గా బోడిపల్లి దేముడు, వైస్ చైర్‌పర్సన్‌గా పేర్ల అమ్మాజీ ఎన్నికయ్యారు. అనంతరం వీరితో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలతి ప్రమాణం చేయించారు.
- జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన స్కూల్ కమిటీ ఎన్నికలో చైర్మన్‌గా మహ్మద్ షకీర్, వైస్ చైర్‌పర్సన్‌గా విమల ఎన్నికయ్యారు. అనంతరం వీరితో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల ప్రతిజ్ఞ చేయించారు.
- జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని యారాడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కమిటీ ఎన్నికలో చైర్‌పర్సన్‌గా రెడ్డి మంగ, వైస్ చైర్మన్‌గా సీహెచ్ ఎల్లాజీ ఎన్నికయ్యారు. వీరితో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం ప్రమాణం చేయించారు. అనంతరం తల్లిదండ్రుల కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. సమావేశంలో చెర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.

అగనంపూడి: గాజువాక మండలం, జీవీఎంసీ 79, 85, 86, 87 వార్డుల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో వివాదాలు తలెత్తకుండా పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా నిర్వహించారు. 85వ వార్డు అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా అట్టా శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్‌గా కొఠారి రమాదేవితోపాటు మరో 22 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి, పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు చెప్పారు. కమిటీ ఎన్నిక తర్వాత మొదటి సమావేశం ఏర్పాటు చేసి ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు పాఠశాలల్లో పర్యటించి సమీక్షించారు.

- 87వ వార్డు కణితి హైస్కూల్‌లో మడక దేవిని చైర్‌పర్సన్‌గా, జి.శ్రీశైలజను వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. తర్వాత సమావేశం ఏర్పాటు చేసి కమిటీ చైర్మన్, వైఎస్ చైర్మన్లతోపాటు సభ్యులతో పాఠశాల హెచ్‌ఎం ప్రకాశరావు, పీడీ మన్నాజీ, శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు.
- 79వ వార్డు శనివాడ ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌గా కె.లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్‌గా ఎం.నాగమణితో పాఠశాల హెచ్‌ఎం రిజ్వానా బేగమ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

ఉత్కంఠభరితంగా ఎన్నికలు

అక్కిరెడ్డిపాలెం: పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు పోలీసుల పహారా మధ్య గురువారం ఉత్కంఠభరితంగా జరిగాయి. జీవీఎంసీ 68వ వార్డు మిందిం జిల్లా పరిషత్ హైస్కూల్ చైర్మన్ దొక్కాడ అప్పలరాజు, వైస్ చైర్మన్ గుద్దాటి కుమారి, మిగిలిన సభ్యులతో హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్. ఆంజనేయ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎక్స్ ఆఫీషియో సభ్యురాలిగా కార్పొరేటర్ గుడివాడ అనూష వ్యవహరిస్తారని తెలిపారు.

- అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ చైర్మన్‌గా పి.కనకారావు, వైస్ చైర్మన్‌గా బి.భారతి ఎన్నికయ్యారు. కమిటీ ఎక్స్‌ఆఫీషియో సభ్యురాలిగా కార్పొరేటర్ గుడివాడ అనూష వ్యవహరిస్తారని, కో ఆపరేటివ్ సభ్యులుగా సంగ్రాన నూకరాజు, బొడ్డు రమణ ఉంటారని ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమార స్వామి తెలిపారు. అలాగే అక్కిరెడ్డిపాలెం, మిందిం, గుడివాడ అప్పన్నకాలనీ, నాతయ్యపాలెం, తుంగ్లాం, చుక్కవానిపాలెం, హరిజనజగ్గయ్యపాలెం ఎంపీపీ స్కూళ్లలోనూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి.


శనివాడ ప్రాథమిక పాఠశాలలో కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హెచ్‌ఎం

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్‌గా ఎం.నూకరత్నం, వైస్ చైర్‌పర్సన్‌గా పి.ఉమారాణి ఎన్నికయ్యారు. వారితో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఎస్‌ఎంసీ కన్వీనర్ కె.విజయ ప్రశాంతి ప్రమాణం చేయించారు.


మిందిం హైస్కూల్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు


కణితి హైస్కూల్ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హెచ్‌ఎం ప్రకాశరావు


అగనంపూడిలో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హెచ్‌ఎం కృష్ణారావు

క్లుప్తంగా

వయనాడ్ బాధితులకు భెల్ కార్మికుల విరాళం


విరాళాల సేకరణలో భెల్ సిటు కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో తుఫాను బాధితులకు భెల్ సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన గేటు వద్ద గురువారం కార్మికుల నుంచి విరాళాలు సేకరించారు. మొత్తం రూ.19 వేలు సేకరించామని, బాధితులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిటు నాయకులు జి.టి.పి.ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, కె.విజయ్ కుమార్, సీతంనాయుడు, కె.నారపురెడ్డి, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు రూ.25 వేలు అందజేత


శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో విరాళం అందజేస్తున్న రత్నకుమారి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో భక్తులు ఎప్పటికప్పుడు విరాళాలు అందజేస్తున్నారు. గురువారం ఏలూరుకు చెందిన శ్రీవారి భక్తులైన నూతక్కి అరవిందకుమార్, రత్నకుమారి దంపతులు దివ్యక్షేత్రంలో శనివారం సాయంత్రం నిర్వహించే అన్నప్రసాద వితరణకు రూ.25 వేలు విరాళంగా ట్రస్ట్ సభ్యులకు అందజేశారు.

ఆటల పోటీలు ప్రారంభం


లంకెలపాలెం హైస్కూల్‌లో క్రీడాకారులతో ఉపాధ్యాయులు

అగనంపూడి: స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో గురువారం పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పీడీ లక్ష్మీరాణి, ఇతర ఉపాధ్యాయులు పోటీలు ప్రారంభించారు. ఈ పోటీల్లో బాలురు, బాలికలు పోటాపోటీగా పాల్గొని సత్తా చాటారు. గెలుపొందిన క్రీడాకారులకు ఈ నెల 15న బహుమతులు అందిస్తామని హెచ్‌ఎం నాగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో రమణ, శ్రీను, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ఉక్కు ఉద్యోగి ప్రతిభ


బహుమతి అందుకుంటున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి రమణ

ఉక్కునగరం: జిల్లా యోగా పోటీల్లో స్టీల్‌ప్లాంట్ చార్జ్‌మెన్ ఎస్.వి.రమణకు ప్రథమ బహుమతి లభించింది. విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా యోగా చాంపియన్‌షిప్ – 2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది పాల్గొనగా రమణ ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. గురూజీ ప్రభాకర్, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎం.రవి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ వి.రామారావు చేతుల మీదుగా రమణ బహుమతి అందుకున్నారు.

ఉత్పత్తికి సరిపడా ముడిసరకు అందివ్వాలి


దీక్షా శిబిరంలో బెంగాల్ మాజీ సీఎం భట్టాచార్యకు నివాళులర్పిస్తున్న కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి విఘాతం కలగకుండా సరిపడా ముడిసరకు అందివ్వాలని ఉక్కు పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో 1274వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.54 వేల కోట్ల మేరకు పన్నుల రూపంలో చెల్లించిందన్నారు. మూడున్నర సంవత్సరాలుగా కార్మికులు తమ నిరసన వ్యక్తం చేస్తుంటే చీమకుట్టినట్టు కూడా కేంద్ర ప్రభుత్వానికి లేకపోవడం దారుణమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించే వరకు ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో యు.రామస్వామి, ఉరివిటి మరిడయ్య పాల్గొన్నారు.

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రికి నివాళి

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటని సిటు నాయకులు ఎస్.రామారావు, శ్రీనివాసరాజు అన్నారు. దీక్షా శిబిరంలో ముందుగా భట్టాచార్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భట్టాచార్య 11 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసి అక్కడి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. బెంగాల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపించిన ఆయన మరణం దేశానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కె.గంగాధర్, కె.వి.సత్యనారాయణ, బి.మహేష్, పెదిరెడ్ల నీలకంఠం, రామచంద్రమూర్తి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యం పరిరక్షణపై పోటీలు నిర్వహించాలి


ఖగేశ్వరరావు

అగనంపూడి: జిల్లా విద్యా శాఖ, ఏపీఎస్‌జీసీ అనకాపల్లి సంయుక్తంగా స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జీవ వైవిధ్యం పరిరక్షణపై పాఠశాలల్లో పోటీలు నిర్వహించాలని ఏపీఎస్‌జీసీ జిల్లా కో ఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు సూచించారు. లంకెలపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలలు, ప్లస్ టూ పరిధిలోని 8 నుంచి 12వ తరగతుల్లోపు బాలలకు పోటీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, మూడు నిమిషాల నిడివిలో షార్ట్ ఫిల్మ్ తయారు చేసి ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయిలో ముందుగా పోటీలు నిర్వహించాలని, ఒక్కో విభాగం నుంచి, ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో విద్యార్థి మాత్రమే పాల్గొనాల్సి వుంటుందని ఆయన తెలిపారు. విజేతలకు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, క్లస్టర్ కో ఆర్డినేటర్ బుడుమూరు అన్నాజీరావు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు


పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ నుంచి గాజువాక హైస్కూల్ రోడ్డులోని 750 కేఎల్ రిజర్వాయర్ వరకు కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు పనులు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా నీటి సరఫరా విభాగం గాజువాక జోన్ ఈఈ కనకరాజు మాట్లాడుతూ పాత పైప్‌లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి వేస్తున్నామని తెలిపారు. శుక్రవారం కూడా పనులు చేపడతామని... అనంతరం పైప్‌లైన్ అనుసంధానం కారణంగా శనివారం మంచి నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. జీవీఎంసీ 66, 67వ వార్డుల పరిధిలోని జోగువానిపాలెం, కృష్ణానగర్, బీసీ రోడ్డు, కణితి రోడ్డు, మెహర్‌నగర్, గోకుల్‌నగర్, 68వ వార్డు పరిధిలోని అక్కిరెడ్డిపాలెంలోని కొంత ప్రదేశానికి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలి


స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. వేతనాల అంశంపై సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్లాంట్ కోసం పని చేస్తున్న ఉద్యోగులకు నేటికీ జీతాలు చెల్లించకపోవడం యాజమాన్యం అసమర్థతకు నిదర్శనమన్నారు. పని చేస్తున్న ఉద్యోగులకు ప్రతీ నెలా 1న జీతాలు చెల్లించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. పన్నులు, జీఎస్టీలు, కరెంటు బిల్లులు వంటివి సకాలంలో చెల్లిస్తూ... ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ పూర్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడిపితే లాభాల బాట పడుతుందన్నారు. ప్రభుత్వం సహకరించి అవసరమైన రా మెటీరియల్ సరఫరా చేయాలని, వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.శ్రీనివాస్, సన్యాసిరావు, శ్రీనివాసరాజు, పుల్లారావు, మరిడయ్య, సంతోష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు నేడు

గాజువాక : వివిధ కంపెనీల్లో ఉద్యోగ నియామకాల కోసం ఈ నెల 9న ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూల్లో ఎనిమిది ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్టు తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లతోపాటు బయోడేటా, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం 9985099698, 9553487988లో సంప్రదించాలని సూచించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో క్రియేటివ్ ఈ - కంటెంట్


ట్రైనింగ్ క్యాంప్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల అధ్యాపకులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం క్రియేటివ్ ఈ - కంటెంట్ కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డాక్టర్ పోలా భాస్కర్ నోడల్ రిసోర్స్ సెంటర్‌లో గల రికార్డింగ్ స్టూడియోను ఉపయోగించుకుని నాణ్యమైన ‘ఈ కంటెంట్’ను తయారు చేయాలని అధ్యాపకులకు సూచించారు. తద్వారా విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించేలా పాఠ్యాంశాలను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్‌గా డి.అరుణపద్మ, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ బి.హైమావతి, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు డి. ప్రజ్ఞతో పాటు ట్రెనింగ్ క్యాంప్‌లో వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (చోడవరం, నక్కపల్లి, నర్సీపట్నం, చింతపల్లి)ల నుంచి పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నిర్వాసిత కాలనీల్లో సబ్ స్టేషన్ ఏర్పాటుకు వినతి


ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: సుమారు 50 వేల జనాభా నివసిస్తున్న అగనంపూడి నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ వెతలు తీర్చడానికి సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఏపీఈపీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.శ్యామ్‌బాబుకు నిర్వాసిత సంఘ నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. 16 నిర్వాసిత కాలనీల్లో 50 వేల పైచిలుకు జనాభా నివసిస్తున్నారని, దీంతో విద్యుత్ వినియోగం రెట్టింపు కావడంతో తరచూ లో ఓల్టేజీ సమస్య ఉత్పన్నమవుతోందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల ఉపకరణాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సెక్టార్ – 3లో సమస్య తలెత్తడంతో విద్యుత్ మీటర్లు కాలిపోయాయని, ఈ కారణంగా కొన్ని ఉపకరణాలు కూడా ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. విద్యుత్ మీటర్లు కాలిపోవడంతో వాటిని సాకుగా చూపించి రూ.1800 నుంచి రూ.2 వేల వరకు విద్యుత్ బిల్లులను వినియోగదారుల నెత్తిన రుద్దారని వినతి పత్రంలో పేర్కొన్నారు. సిబ్బంది ముందు నెల బిల్లు లేదా రెండు మూడు నెలల సరాసరి బిల్లులు వసూలు చేయాల్సిన సిబ్బంది మూడు నెలల్లో ఎక్కువ ఏ నెల బిల్లు అధికంగా ఉంటే ఆ బిల్లు మొత్తం చెల్లించాలని డిమాండ్ చేస్తుండడంతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈఈ చంద్రశేఖర్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, విందుల నారాయణరావు, మజ్జి శ్రీనివాసరావు, కోసూరి తాతారావు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి పుట్టి పండగ


అగనంపూడిలోని షిర్డీ సాయి ఆలయంలో సుప్రభాత సేవలో భక్తులు

అగనంపూడి: సత్యసాయి బాబా పుట్టి పండగ (99 రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమం)ను పురస్కరించుకొని అగనంపూడిలోని షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం ఘనంగా ఓంకార జపం, సుప్రభాత సేవ, నగర సంకీర్తన నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సత్యసాయి, షిర్డీసాయి బాబా భక్తులు అగనంపూడి పరిసర నిర్వాసిత కాలనీల్లో భజనలు చేశారు. ఓంకార స్మరణతో ప్రారంభమైన కార్యక్రమంలో సుప్రభాత సేవ నిర్వహిస్తుండగా, మరోవక్క సత్యసాయి గీతాలాపనతో నగర సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన మండలి అగనంపూడి కన్వీనర్ విందుల పైడినాయుడు, బి.వి.సుబ్బారావు, షిర్డీసాయి మందిర కమిటీ చైర్మన్ కొయ్య రమణారెడ్డి మాట్లాడుతూ హైందవ ధర్మ ప్రచారం, ఆధ్యాత్మికతను స్థానికుల్లో పెంపొందించేందుకు స్థానికంగా ఉన్న ఆలయ కమిటీలతో సంయుక్త కార్యక్రమాలు చేపడితే మంచిదన్నారు. కార్యక్రమంలో ధర్మాల వ్యాసశర్మ, విందుల వరహాలు, పి.సత్యనారాయణ, పీఎల్ఎన్‌రాజు, కిషోర్, ఈశ్వరరావు, గణేష్, రామన్, జయ, రమణమ్మ, కళ, డి.సత్యలక్ష్మి, పంకజ, పద్మ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

నాట్ రీచబుల్..!

- స్టీల్‌ప్లాంట్‌లో మొబైల్ సిగ్నల్ తిప్పలు
- జియో సిమ్‌లు పనిచేయక ఉద్యోగులకు ఇబ్బందులు


స్టీల్‌ప్లాంట్ ముఖచిత్రం

ఉక్కునగరం: ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ నిత్యావసర వస్తువుగా మారింది. ఉన్న చోట నుంచే అవతలి వ్యక్తికి సమాచారమిచ్చే మొబైల్ లేకుండా ఒక రోజు కూడా ఉండలేని పరిస్థితికి అందరూ అలవాటు పడిపోయారు. తాము ఉండే ప్రదేశంలో ఏ నెట్‌వర్క్ సిగ్నల్ ఉంటుందో ఆ నెట్‌వర్క్‌కు మారిపోవాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. అయితే స్టీల్‌ప్లాంట్‌లో మాత్రం అధికారిక సీయూజీ (కామన్ యూజర్ గ్రూప్) నెట్‌వర్క్‌కు సరైన సిగ్నల్స్ లేకపోవడంతో తోటి ఉద్యోగులకు, సంబంధీకులకు సమాచారమివ్వడం క్లిష్టంగా మారుతోంది. స్టీల్‌ప్లాంట్‌లో కనిష్ట అధికారి నుంచి గరిష్ట అధికారి వరకు, సీనియర్ కార్మికులకు మొబైల్ సిమ్‌లు ఉచితంగా ఇచ్చి ఆయా గ్రేడ్లను బట్టి టాక్‌టైమ్ సదుపాయం కల్పిస్తుంటారు. దీని కోసం యాజమాన్యం టెండర్ ప్రాతిపదికన నెట్‌వర్క్‌లను మారుస్తూ ఉంటుంది. చాలా ఏళ్ల పాటు కాంట్రాక్టు నిర్వహించిన ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ వల్ల మొదట్లో ఉద్యోగులు ఇబ్బందులు పడినా తర్వాత వారు తగిన సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. ఆ తర్వాత కొన్నేళ్లు బీఎస్‌ఎన్‌ఎల్ టెండర్ తీసుకుని సేవలు అందించింది. ఆ తర్వాత టెండర్ దక్కించుకున్న జియో నెట్ వర్క్ మాత్రం ప్రస్తుతం ఉద్యోగులకు చుక్కలు చూపిస్తోంది. ఒకే విభాగంలో ఉన్న వారికి నార్మల్ కాల్స్ చేస్తే నాట్ రీచబుల్ అని రావడం పరిపాటిగా మారిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక వాట్సాప్ పనితీరైతే చెప్పనక్కర లేదు. వినియోగదారులు నరకం చూడాల్సిందే. విధి నిర్వహణలో భాగంగా పీడీఎఫ్ ఫైల్స్, డ్రాయింగ్స్ మొబైల్స్‌లో చూద్దామంటే వారి బాధలు చెప్పనలవి కాదు. ఇక విభాగాల పని ప్రదేశాల నుంచి ఆఫీసులకు ఫోన్ చేయాలంటే సిగ్నల్ అందడం లేదు. ఈ సమస్యను ఎవరికి చెప్పినా పట్టించుకోకపోవడంతో మెజార్టీ ఉద్యోగులు సిగ్నల్ వచ్చే నెట్‌వర్క్‌తో అదనపు సిమ్‌లను ఉపయోగించాల్సి వస్తోంది.

సిగ్నల్ రావడం లేదు



స్టీల్‌ప్లాంట్‌లోని ఏ విభాగంలో చూసినా సీయూజీ నెట్‌వర్క్ (జియో)కు సిగ్నల్ సరిగా రావడం లేదు. దీంతో తోటి ఉద్యోగులకు, సంబంధీకులకు సమాచారమివ్వడం చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. యాజమాన్యం సీయూజీ సిమ్ ఇచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో వేరే నెట్‌వర్క్ సిమ్ తీసుకున్నాం. సిగ్నల్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు జియో యాజమాన్యం చర్యలు తీసుకోవాలి.

– ఎస్.రమేష్‌కుమార్, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను గురువారం నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి సందర్శించారు. కంచరపాలెం పీఎస్ పరిధిలో పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సిబ్బందికి సీపీ సూచించారు. స్టేషన్ ఆవరణ, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

క్రైం సిబ్బంది విధులపై అసంతృప్తి

అనంతరం అదే పోలీస్ స్టేషన్‌లో మేడపైన ఉన్న కంచరపాలెం, ఎయిర్‌పోర్టు క్రైం స్టేషన్లను పోలీస్ కమిషనర్ సందర్శించారు. జీడీ ఎంట్రీ బుక్‌ను పరిశీలించిన ఆయన పుస్తకంలో ఎందుకు వారి వారి ఎంట్రీలను నిర్వహించడం లేదని, వారి కదలికలను ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు క్రైం స్టేషన్‌లో సిబ్బంది లేకపోవడంతో అక్కడ నుంచే క్రైం డీసీపీ వెంకటరత్నంతో ఫోన్‌లో సీపీ మాట్లాడారు. పలు విషయాలు అడిగి తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రైం అధికారులు, సిబ్బంది ఏ సమయానికి వస్తున్నారు, ఏ సమయానికి వెళ్తున్నారో కూడా నమోదు చేయకపోవడంతో వారిపై సీపీ అసహనం వ్యక్తం చేశారు. క్రైం విభాగంలో విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ ఎస్.భాస్కరరావు, ఎస్ఐ రవికుమార్, క్రైం ఎస్ఐ ప్రకాషరావు, ఏఎస్ఐ సతీష్ ,సిబ్బంది ఉన్నారు.